క్లుప్తంగా

రహదారి నిర్మించరూ!



ప్రమాదకరంగా ఉన్న ఉండూరు రైల్వే గేటు రోడ్డు

సామర్లకోట: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి ఉండూరు వెళ్లే రహదారి ప్రమాదకరంగా మారింది. ఉండూరు రైల్వే గేటు సమీపంలో ప్రధాన తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు దాని మరమ్మతులకు గొయ్యి తీశారు. దీని వల్ల నాలుగు రోజులుగా ఫిల్టర్ ప్లాంటు నుంచి పైపులైన్ మీదుగా తాగునీటి పంపింగ్ నిలిపి వేసి పనులు పూర్తయిన తరువాత గోతిని ఇసుకతో పూడ్చి గొయ్యి ఉందని తెలిసేలా డివైడర్ ఏర్పాటు చేసి జెండాలు కట్టారు. సామర్లకోట–కాకినాడ మధ్య ప్రయాణించే వాహన చోదకులతో రద్దీగా ఉండే ఈ రహదారిపై ఈ గోతి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ అధికారులు బాధ్యత తీసుకొని గొయ్యి తీసిన ప్రదేశంలో రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ దుర్గాదేవి

పిఠాపురం: పిల్లల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దుర్గాదేవి సూచించారు. పిఠాపురం మండలం చిత్రాడ జెడ్పీ హైస్కూల్‌లో మండల స్థాయిలో మంగళవారం ఆమె అంగన్‌వాడీలకు శిక్షణ ఇచ్చారు. మూడు రోజుల పాటు పోషణ్ భీ పడాయి భీ అనే కార్యక్రమం మీద శిక్షణ నిర్వహించనున్నామన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాలలో ఎలాంటి కార్యక్రమాలు రూపొందించాలనే దానిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పిల్లల ఎదుగుదల పోషణ, పౌష్టికాహారం తదితర విషయాలపై సిబ్బందికి అవగాహన కల్పించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

29న టీటీడీసీలో జాబ్ మేళా

సామర్లకోట: స్థానిక టీటీడీసీలో ఈనెల 29వ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణాభివృద్ధి అధికారి ఎం.కొండలరావు, సిడాప్ జేడీఎం కిరణ్, జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. బ్లూ ఓషన్ బయోటెక్, టీమ్ లీజ్, ఎల్‌జీ ఆథరైజ్డ్ సెంటర్‌లో 10వ తరగతి ఐటీఐ, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసున్న, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు బయోడెటా, ఆధార్‌కార్డు జెరాక్స్, సర్టిఫికెట్లతో సామర్లకోట టీటీడీసీలో హాజరు కావలసిఉంటుందన్నారు. వివరాలకు సెల్ నెంబరు 94407 56250, 99491 56583లను సంప్రదించవచ్చునని తెలిపారు.

నవోదయకు మేడపాడు విద్యార్థులు





నవోదయకు ఎంపిక అయిన ఆకుల సుకుమార్ జమ్మి బాలశ్రీ సాయిరోక్షిత్

సామర్లకోట: మండలం జి. మేడపాడు మండల పరిషత్తు పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జి. మేడపాడు మండల పరిషత్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న జమ్మి బాలశ్రీ సాయి రోక్షిత్, ఆకుల సుకుమార్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారన్నారు. వీరు ఆరో తరగతిలో నవోదయలో చేరే అవకాశం ఉంటుందని చెప్పారు. వీరికి ఆ పాఠశాల టీచరు చవ్వాకుల సత్యనారాయణ శిక్షణ ఇచ్చారన్నారు. ఇద్దరు విద్యార్థులను ఎంఈఓ అభినందించారు.

పన్ను చెల్లింపునకు 50 శాతం వడ్డీ రాయితీ

సామర్లకోట: ఈనెల 31వ తేదీ లోపుగా ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు చెల్లించిన వారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇవ్వనున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జీఓ విడుదలైనట్టు ఆమె తెలిపారు. ఇంటి, ఖాళీ స్థల యజమానులు మున్సిపల్ కార్యాలయం, మీసేవా, సచివాలయాల్లో సెలవు దినాల్లో కూడా పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకకరించాలన్నారు.

దున్న తొక్కితే దోషం దూరం!

- అమీనాబాద్‌లో వింత ఆచారం
- రేపు పోలేరమ్మ తల్లి తీర్థం
- నేటి జాతరకు సమాయత్తం



పడుకున్న భక్తులపై నుంచి వెళ్తున్న దున్నపోతు (ఫైల్)



పోలేరమ్మ తల్లి

కొత్తపల్లి: అదో మత్స్యకార గ్రామం. అక్కడ ఉన్న పోలేరమ్మ తల్లి జాతర జరుగుతోంది. భక్తులందరూ స్నానాలు చేసి అమ్మవారి ఆలయం ముందు సాష్టాంగపడ్డారు. ఇంతలో ఒక దున్నపోతును తీసుకువచ్చి వారిని తొక్కించుకుంటూ నడిపించారు. ఇదంతా చూస్తున్నవారికి ఆశ్చర్యకరమే అయినప్పటికీ అక్కడి వారికి మాత్రం అది ఒక ఆచారం. అది పాటించకపోతే గ్రామానికే అరిష్టమని వారి నమ్మకం. వివరాల్లోకి వెళితే మండలం అమీనాబాద్‌లో పూర్వం నుంచి ఒక ఆచారం సాగుతోంది. ఇందులో ఒక దున్నపోతును తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామస్తులు ఉదయం నుంచి ఉపవాసం ఉండి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గరగ నృత్యాల మధ్య దున్నపోతును గ్రామమంతా ఊరేగించి ఆలయం వద్దకు తీసుకువస్తారు. ఉపవాసం ఉన్న భక్తులందరూ పసుపునీళ్లతో స్నానంచేసి అమ్మవారి ఆలయం ఎదుట పడుకుంటారు. వెంటనే ఆ దున్నపోతును తీసుకుని ఒక భక్తురాలు పడుకున్న వారిమీదుగా నడిపిస్తారు. అలా మూడు సార్లు తొక్కితే వారి కష్టాలు పోతాయని వారి నమ్మకం. అనంతరం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో భక్తులందరూ విశేష పూజలు చేస్తారు. గరగ నృత్యాలతో గ్రామమంతా దద్దరిల్లిపోతుంది. ఆ రాత్రంతా జాగారం చేస్తారు. ఈ వింత ఆచారాన్ని తిలకించేందుకు మండలం, జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తండోపతండాలుగా వచ్చి తిలకిస్తుంటారు.

రేపు పోలేరమ్మతల్లి తీర్థం

గ్రామ దేవత పోలేరమ్మతల్లి తీర్థం గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచ్ నక్క మణికంఠబాబు తెలిపారు. బుధవారం రాత్రి పోలేరమ్మతల్లి జాతరను వైభవంగా నిర్వహించాను న్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు ఏర్పాటు చేశారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన యువకులు

పెద్దాపురం: ఓ ప్రైవేట్ పాఠశాల బస్సు, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలం కాండ్రకోట–మర్లావ గ్రామాల మధ్యలో మంగళవారం చోటు చేసుకున్న ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సామర్లకోట కేఎస్ఎన్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి బైక్‌పై వస్తున్న ముగ్గురిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కాట్రావులపల్లికి చెందిన కంచుమర్తి వెంకటేష్ (35), చిట్టిడి అమ్మన్న (27)లకు తీవ్ర గాయాలు కావడంతో పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఘటనపై ఎస్ఐ మౌనికను వివరణ కోరగా ప్రమాద సమాచారం ఉందని, కాకినాడ జీజీహెచ్ నుంచి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఆదర్శ రైతులకు సత్కారం



ఆదర్శ రైతులను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాదికారి విజయకుమార్

పిఠాపురం: ఎప్పటికైనా ప్రకృతి పరంగానే వ్యవసాయం అభివృద్ధి సాధిస్తుందని గ్రహించి ఆదిశగా అడుగులు వేసి సేంద్రీయ వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్.విజయకుమార్ అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ప్రకృతి వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించిన అందరికి ఆదర్శంగా నిలిచిన ఆదర్శ రైతులను ఆయన మంగళవారం చేబ్రోలులో ఘనంగా సత్కరించారు. రసాయనక పంటల సాగుకు స్వస్తి పలికి సేంద్రియ సాగు చేపట్టి ఉత్తమ విజయాలు సొంతం చేసుకున్న ఆదర్శ రైతులను మిగిలిన రైతులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాడి పంటా రెండు ఒకప్పుడు రైతు ఇంట ఉండేవని అదే సేంద్రియ వ్యవసాయానికి పునాదిగా ఉండేదన్నారు. రసాయనక పంటలు వచ్చాకా పాడిపంటా దెబ్బతిందని తిరిగి మళ్లీ సేంద్రియ వ్యవసాయం రాకతో పాడి పంటా అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈసందర్భంగా ఆయన చేబ్రోలుకు చెందిన సేంద్రియ రైతులు పర్వత కొండబాబు, గవరసాని చంటిబాబు, సారేపల్లి నాగేశ్వరరావు, తుమ్మలపల్లి వెంకటరమణ, గుండ్ర గంగలను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజరు, ఏడీఏ పి.స్వాతి, ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ, గొల్లప్రోలు వ్యవసాయ శాఖాధికారి సత్యనారాయణ, గోగాయత్రి పకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణ కేంద్రం నిర్వాహకుడు గుండ్ర శివచక్రం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోండి

చేనేత అభివృద్ధి అధికారి ఫణిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఫణిబాబు

పెద్దాపురం: చేనేత కార్మికులకు ఇస్తున్న ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని చేనేత అభివృద్ధి అధికారి, పెద్దాపురం చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఎస్‌వి ఫణిబాబు అన్నారు. స్థానిక భాస్కర కాలనీలో ముప్పన రామారావు చేనేత సహకార సంఘ కార్యాలయం మంగళవారం మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా ఫణిబాబు మాట్లాడుతూ మగ్గంపై నేసే వారికి మాత్రమే కాకుండా చేనేత పరిశ్రమపై ఆధారపడి కండెలు చుట్టేవారు, నూలు డబ్బాలు తోడేవారు, ఆసు విసిరేవారు, అచ్చులు అతికేవారు, రంగులు వేసే కార్మికులకు ఉచిత విద్యుత్‌ను అమలు చేస్తున్నట్టు తెలిపారు. చేనేత కార్మికులకు ఉపయోగకరమైన థ్రిఫ్ట్ ఫండ్ పథకంలో సభ్యులుగా చేరాలన్నారు. ఈ పథకంలో చేరిన కార్మికులు తమ వేతనంలో 8 శాతం జమ చేస్తే ప్రభుత్వం 16 శాతం కలిపి తిరిగి అందజేస్తారన్నారు. మహాజన సభలో సొసైటీ మేనేజర్ తూతిక చంద్రశేఖర్ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ 239 మంది సభ్యులున్న సహకార సంఘంలో 120 మందికి మగ్గాలున్నాయన్నారు. వీరిలో 60 మంది సొసైటీకి వస్త్రాలు నేస్తారన్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ద్వారా 55,31,155 వస్త్రాలు ఉత్పత్తి జరుగగా, రూ.6,69,100 విక్రయాలు జరిగాయన్నారు. ఆప్కో నుంచి రూ.31,98,670, పావలా వడ్డీ రూ.30,90,299, నూలు సబ్సిడీ రూ.31,91,555, డిస్కౌంట్ రూ.3,46,157, ప్రభుత్వం నుంచి బకాయిలు రావాల్సి ఉందన్నారు. ప్రస్తుతం సొసైటీలో 31,25,825 వస్త్రాల నిల్వలున్నాయన్నారు. ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు మాట్లాడుతూ చేనేత పరిశ్రమ పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయ్యాలని కోరారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల చేనేత కార్మికులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటిన్ తనిఖీ



అన్నా క్యాంటిన్‌ను తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్

సామర్లకోట: స్థానిక బసివిరెడ్డి సత్రం సమీపంలోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న అన్నా క్యాంటిన్‌ను మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య మంగళవారం తనిఖీ చేశారు. నిత్యం భోజనాలకు వస్తున్న వారి సంఖ్యను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. భోజనాలు చేస్తున్న వారిని రుచి ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. కాంటిన్‌లో తాగునీటి సదుపాయాన్ని పరిశీలించి పాడైన పైపులను మరమ్మతులు చేయించాలని సూచించారు.

పోరం'బైకు'లు హల్‌చల్..!

- విద్యార్థులను ఆందోళనలకు గురి చేస్తున్న ఆకతాయిలు
- పట్టించుకోని పోలీసులు
- భీతిల్లుతున్న తల్లిదండ్రులు



చేబ్రోలు ప్రభుత్వ జెడ్పీ హైస్కూలు వద్ద బైక్‌లపై హల్‌చల్ చేస్తున్న ఆకతాయిలు

పిఠాపురం: పాఠశాలల వద్ద అల్లరి మూకలు హల్‌చల్ చేస్తున్నారు. బైక్‌లపై విన్యాసాలు చేస్తూ నడిరోడ్డుపై బీభత్సం సృష్టిస్తున్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద అతి వేగంగా బైక్‌లు నడుపుతూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తున్న తీరును చూసిన తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారిని నియంత్రించాల్సిన పోలీసులు పట్టనట్టుగా వ్యవహరించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల పిఠాపురం సభలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈవ్‌టీజింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పినా పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. కేవలం అవగాహనా సదస్సులతో సరిపెట్టేసిన పోలీసులు పరీక్షా కేంద్రాలు, పాఠశాలల వైపు కన్నెత్తి చూడకపోవడంతో అల్లరి మూకలు మితిమీరిపోతున్నట్టు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలు విడిచి పెట్టే సమయంలో ఒక్కో బైక్‌పై ముగ్గురు నుంచి నలుగురు అత్యంత వేగంగా నడుపుతూ స్టంట్లు చేస్తున్న భయంకర విన్యాసలు చూసిన విద్యార్థులు బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకుని తమ పిల్లలకు రక్షణ కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కార్పొరేషన్ రుణాలకు 1713 దరఖాస్తులు

కొత్తపల్లి: ప్రభుత్వం ద్వారా అందించే కార్పొరేషన్ రుణాలకు 1713 దరఖాస్తులు అందాయని ఎంపీడీఓ రవికుమార్ తెలిపారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు సంబంధించి బీసీ, ఓసీ, ఎస్సీ, ఎస్టీలకు కార్పొరేషన్ రుణాల కోసం 1713 ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను, ధృవీకరణ పత్రాలను సంబంధిత గ్రామ సచివాలయంలో అందించాలన్నారు. ఉచిత కుట్టు మెషీన్ మంజూరు కోసం 963 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు.

ఏసీబీకి చిక్కిన ఎస్సైకి రిమాండ్

పిఠాపురం: ఏసీబీకి చిక్కిన రూరల్ ఎస్సై గుణశేఖర్, ఆయన వ్యక్తిగత డ్రైవర్ నల్లా శివలకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పిఠాపురం మండలం పి.దొంతమూరుకు చెందిన కిల్లాడి దుర్గాప్రసాద్, సానబోయిన గంగరాజులను 2024 అక్టోబర్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసు నుంచి తప్పించేందుకు ఎస్సై రూ.20 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తన సిబ్బందితో దాడి చేసి ఎస్సై ఆయన డ్రైవర్లను పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఇది ఇలా ఉండగా ఏసీబీ అధికారులు నిందితుల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాటితో పాటు కొన్ని కేసులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఎస్సై ఫోన్ నుంచి ఫోన్‌పే ద్వారా కొంత నగదు ఎస్సీ, ఎస్టీ కేసులు చూసే ఒక ఉన్నతాధికారి వద్ద పని చేసే సిబ్బందికి వెళ్లినట్టు గుర్తించిన ఏసీబీ అధికారులు గుర్తించి వాటిపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. నిందితుల ఫోన్లలో వాట్సాప్, ఫోన్ కాల్స్‌ను పరిశీలిస్తున్నట్టు సమాచారం. ఏసీబీ అధికారుల దాడి నేపథ్యంలో కాకినాడ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీసు స్టేషన్లకు ప్రైవేటు వ్యక్తులు ఎవరు రావద్దని పోలీసులు హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిసింది.

చేనేత సహకార ఎన్నికలు జరిపించండి

ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన



సమావేశంలో మాట్లాడుతున్న ఆప్కో మాజీ డైరెక్టర్ వీర్రాజు

పెద్దాపురం: చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించాలని కోరారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ చేనేత సంఘం సంక్షోభం వల్ల చేతి నిండా పనిలేక కార్మిక కుటుంబాలు అల్లాడుతున్నాయన్నారు. 2018 ఫిబ్రవరిలో చేనేత పాలకవర్గ పదవీ కాలం ముగిసిన తరువాత ఇప్పటి వరకు పాలకవర్గాలకు ఎన్నికలు జరగకుండా కమిటీలు, పర్సన్ ఇన్‌చార్జిల ద్వారా సంఘాలను నడుపుతున్నారన్నారు. పాలకవర్గాలు లేక సొసైటీల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అమలు చేయడం అభినందనీయమని, చేనేత సహకార సంఘాలకు ఆప్కో బకాయిలు వెంటనే విడుదల చెయ్యాలన్నారు. ప్రభుత్వం బాకీ పడిన పావలా వడ్డీ, యార్న్ సబ్సిడీ, డిస్కౌంట్ బకాయిలన్నీ విడుదల చేస్తే ఎక్కువ మంది కార్మికులకు పని కల్పించే వీలుంటుందన్నారు. సంఘాల ద్వారా వస్త్రాల అమ్మకాలపై 30 శాతం రిబేటును అమలు చేయాలని వీర్రాజు కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం



పోక్సో చట్టంపై అవగాహన కల్పిస్తున్న మేజిస్ట్రేట్ నిరూప భాన్జ్ డియో

కాకినాడ రూరల్: గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన కలిగి ఉండాలని, బాలికలకు పోక్సో చట్టం రక్షణగా నిలుస్తుందని కాకినాడ నాలుగో అదనపు జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ నిరూప భాన్జ్ డియో పేర్కొన్నారు. మండలంలోని పి.తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థిలను పోక్సో చట్టంపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. తిమ్మాపురం ఎస్‌హెచ్‌ఓ సుస్మిత అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో బాలికలు, మహిళలకు రక్షణగా ఉన్న చట్టాల గురించి మేజిస్ట్రేట్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి

జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి విజయకుమార్

పిఠాపురం: ప్రస్తుత పరిస్థితుల్లో పెట్టుబడి తగ్గించి ఎక్కువ లాభంతోపాటు ఆరోగ్యకరమైన పంటలను అందించడానికి రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.విజయకుమార్ పిలుపునిచ్చారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కేపీపీ 2025లో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మంగళవారం నిర్వహించిన వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల మండల స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొన్ని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. గత కొన్నేళ్లుగా సేంద్రియ వ్యవసాయం విలువ తెలుసుకుని ఎక్కువ మంది రైతులు ఆ దిశగా వ్యవసాయం ప్రారంభించి మంచి ఫలితాలు సాధిస్తున్నారన్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని ప్రతి రైతు సేంద్రియ వ్యవసాయం వైపు దృష్టి సారించి మంచి పంటలను పండించడానికి కృషి చేయాలన్నారు. పకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు ఉన్న డిమాండ్ రసాయనిక పంటలకు ఉండదని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సేంద్రియ సాగు చేపట్టాలని పకృతి వ్యవసాయ శాఖ డీపీఎం ఎలియాజరు రైతులకు సూచించారు. పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ పి.స్వాతి మాట్లాడుతూ ఇప్పటికే ఎక్కువ మంది వరి ఇతర పంటలు సేంద్రియ విధానంలో సాగు చేస్తున్నారని వంద శాతం పంటలు సేంద్రియ పద్ధతిలోనే జరిగేలా రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. వాణిజ్య పంటలు కూడా పండించేందుకు కృషి చేయాలని పిఠాపురం ఉద్యాన శాఖాధికారి కేఎస్ శైలజ అన్నారు. ఈ సందర్భంగా వచ్చే ఖరీఫ్‌లో ప్రకృతి వ్యవసాయంలో ఏమే పంటలు వేస్తారు అనే ప్రణాళిక కోసం రైతుల అభిప్రాయాలు సేకరించారు. ప్రకతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లే దిశలో ఏ శాఖ ఏ విధంగా సహాయపడుతుంది అనే విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై 29న మాక్‌డ్రిల్

28న సన్నాహక సమావేశం



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో వెంకటరావు

కాకినాడ సిటీ: వరదలు, తుపానుల సమయంలో చేపట్టాల్సిన తక్షణ సహాయక చర్యలు, సంసిద్ధతపై 29వ తేదీన తాళ్లరేవు మండలం కొత్తలంక గ్రామంలో మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో విపత్తుల నిర్వహణ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో డీఆర్వో సమీక్షించారు. ఈ సందర్భంగా విపత్కర సమయాల్లో ఆయా శాఖలు చేపట్టే చర్యలను అడిగి తెలుసుకున్నారు. 29 నిర్వహించే మాక్‌డ్రిల్ ద్వారా ప్రజలకు ఆయా సందర్భాల్లో తీసుకోవలసిన చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ మాక్‌డ్రిల్‌కు 28వ తేదీన నిర్వహించే టేబుల్ టాప్ ఎక్సైర్‌సైజ్‌కు ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని డీఆర్వో ఆదేశించారు. సమావేశంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, జిల్లా అగ్నిమాపక అధికారి పీవీఈఎస్ రాజేష్, పౌరసరఫరాల సంస్థ ఎండీ ఎం దేవులా నాయక్, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, ఇరిగేషన్ ఈఈ జి శేషగిరిరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.భారతి, తాళ్లరేవు తహసీల్దార్ పి.త్రినాథరావు, డివిజనల్ పీఆర్వో పి.రవి తదితర అధికారులు పాల్గొన్నారు.

సంప్రదాయ పోటీలకు ఆహ్వానం



ఉగాది పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

బోట్‌క్లబ్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా పిల్లలకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, పండుగ విశిష్టతపై కవితల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక రాంకోసా హాల్‌లో మంగళవారం పోటీల పోస్టర్‌ను పలువురు వైద్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యులు పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఉగాది పోటీలు నిర్వహిస్తామన్నారు. 30వ తేదీ సాయంత్రం 4.30కు పంచాంగ శ్రవణం, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. డాక్టర్ శైలజ మాట్లాడుతూ భారతీయ సంప్రదాయాలు విలువలను నేటి తరానికి తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. వైద్యులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అడ్డాల సత్యనారాయణ, యు రామకృష్ణ, ఉమ పాల్గొన్నారు.